## క్లుప్తంగా

### క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం



జుజ్జూరు(వీరులపాడు):క్రీడలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని సూచించారు. ఆటలు ఆడటం వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాల్లో సైతం ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

### అంగన్‌వాడీల్లో పోషకాహార మాసోత్సవాలు



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు):పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటల ద్వారా పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేశారు. ఆకుకూరలు, కూరగాయల పేర్లను చిన్నారులతో చెప్పించటం వాటి ఆవశ్యకతను తెలియజేశారు. చిరుధాన్యాలను తినటం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

### మట్టి వినాయక విగ్రహాల తయారీపై అవగాహన



నందిగామ: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో మట్టి వినాయక విగ్రహానికి పూజ చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వాటి తయారీపై అవగాహన, ప్రోత్సాహక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఉపాధ్యాయులు పరిశీలించడంతోపాటు వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వినాయక చవితిని మట్టితో తయారుచేసిన విగ్రహాలతోనే జరుపుకోవాలని కోరారు. ఇదేవిధంగా ప్రతి ఇంట్లో మట్టి విగ్రహంతో చవితి వేడుకలు జరుపుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

### మసీదు ప్రహరీ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



జుజ్జూరు(వీరులపాడు):తమకున్నంతలో తోటి వారికి సహాయపడాలనుకోవటం అభినందనీయమని గౌసియా జామియా మసీదు మత గురువు రాయల్ రాజా తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జామియా మసీదు ప్రహరీ నిర్మాణానికి గ్రామానికి చెందిన దండా నవీన్‌కుమార్ రూ. లక్ష విరాళాన్ని శనివారం మత పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థితిమంతులు తమకున్నంతలో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం ఆర్థిక సహకారం అందించిన నవీన్‌కుమార్‌ను మత పెద్దలతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ చిన్న మీరా హుస్సేన్, మత పెద్దలు షేక్ ఖాజాపూర్, షేక్ నాగుల్‌మీరా, అనీఫ్, కాజా, మౌలాలి, తాజుద్దీన్ బాబా, జయాలుద్దీన్, పలువురు ముస్లిం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్ఎంసీ హైస్కూల్లో కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటు



భవానీపురం: దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్(డీఎస్ఎంసీ) హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. వస్తువుల కొనుగోలు విషయంలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండే విధంగా ఈ క్లబ్ ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# ప్రతి గడపలో సంక్షేమ సంతకం

**ప్రభుత్వ విప్ ఉదయభాను**



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపలో సంక్షేమ సంతకం వెల్లి విరుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 14 వ సచివాలయం పరిధిలోని 31 వ వార్డు, 25, 26 వార్డుల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. శాంతినగర్, విష్ణు ప్రియనగర్, కొలిమిబజారు, తోటబజారు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఉదయభాను పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఎంత మొత్తం లబ్ధి చేకూరిందో తెలియజేసే పత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు కాకుండా పచ్చచొక్కాల వారికే ప్రభుత్వ పథకాలు అందించిందని గుర్తుచేశారు. నీరు చెట్టు పేరుతో ప్రజా ధనాన్ని దోచుకున్నారు తప్ప అభివృద్ధి పనులు చేపట్టలేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గ్రామ, వార్డు వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పాలనలో సౌలభ్యం, పారదర్శకత వచ్చాయన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కోసం ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే నేరుగా వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం...**

పట్టణంలోని శాంతినగర్, విష్ణుప్రియనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఉదయభాను మాట్లాడుతూ పారిశ్రామికవాడగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాలైన శాంతినగర్, విష్ణుప్రియనగర్ తదితర ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతవాసులకు రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు, వాటర్ ట్యాంక్, పైపులైన్లు, ఓపెన్ పార్కులు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ వంటి మౌలిక వసతి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రామయ్య, పందుల రోశయ్య, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి,ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దూనాయక్, మండల మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు లక్ష్మి, వార్డు నాయకులు మన్నె అప్పారావు, దరిసె వెంకటేశ్వరరావు, సయ్యద్ నూరుద్దీన్, సయ్యద్ ఆలీ, పగిడిపర్తి రాము, శ్రీను, మొక్క గురునాధం, దేవాభక్తుని నాగేశ్వరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో గ్రామీణ ప్రాంతాలు

**ఎమ్మెల్యే జగన్‌మోహనరావు**



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందించి నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారన్నారు. కరోనాతో ఆర్థిక సంక్షోభాలు ఎదురైనా సంక్షేమ పథకాల అమలులో మాత్రం వెనకడుగు వేయలేదని గుర్తు చేశారు.

**ప్రతి ఒక్క సమస్యకూ పరిష్కారం....**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించి అందుకనుగుణంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, నాయకులు షేక్ జయాలుద్దీన్, రమావత్ రాము, ఫయాజ్, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

### 21న హుండీ లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 21న జరుగుతుందని ఆలయ ఇన్‌చార్జ్ ఏసీ జయప్రకాష్‌బాబు శనివారం పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు దేవదాయ శాఖాధికారుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

### మట్టి విగ్రహాలనే పూజిద్దాం



జగ్గయ్యపేట అర్బన్:వినాయకచవితి ముందస్తు వేడుకలు పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విజ్ఞాన్ హైస్కూల్లో డైరెక్టర్ తన్నీరు సుధారాణి విద్యార్థులతో మట్టి విగ్రహాలను తయారుచేయించి పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలనే పూజిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కంచికచర్ల :జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర ఆవశ్యకతను తెలియజేశామని హెచ్ఎం పి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ముందుగా పలు విభాగాల్లో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలసి కన్స్యూమర్స్ క్లబ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయేల్, పుల్లారావు, రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవకోటికి ఓజోన్ పొర రక్షణ కవచం



ఓజోన్ దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



పాఠశాల ఆవరణలో ఓ 3 ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

**ప్రభుత్వ విప్ ఉదయభాను**

జగ్గయ్యపేట అర్బన్:భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర భూమి నుంచి వెలువడే అతి శక్తివంతమైన, ప్రభావంతమైన అతినీలలోహిత కిరణాలను శోషించుకొని సకల జీవకోటికి రక్షణగా నిలుస్తుందని అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో శనివారం నిర్వహించిన ప్రపంచ ఓజోన్ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయభాను ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూర్యుడి నుంచి ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమి మీద పడకుండా కాపాడే రక్షణ కవచం ఓజోన్ పొర అన్నారు. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతుందన్నారు. కాలుష్యం కారణంగా మానవ కోటి మనుగడకు పెనుముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓజోన్ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని తెలిపారు. ఓజోన్ పరిరక్షణపై విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్,హఫీజున్నీసా ఫిరోజ్, హెచ్ఎం.మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చదువుతోనే మంచి భవిష్యత్....**

చదువుతోనే మంచి భవిష్యత్ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఉదయభాను అన్నారు. వాగ్దేవి జూనియర్ అండ్ డిగ్రీ మహిళా కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక కొత్త కల్యాణమండపంలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయభాను మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం పాఠశాలలో 10 వ తరగతి పూర్తిచేసి వాగ్దేవి కళాశాలలో అన్ని గ్రూపుల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థులు షేక్ షహనా, నామ అఖిల, బాలు త్రివేణి, సుప్రియలను ఉదయభాను అభినందించారు. ర్యాంకు సాధించిన వారికి విమలాభాను ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహంగా ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు అందజేశారు.

**జెడ్పీ స్కూల్లో ఓజోన్ దినోత్సవం**

నందిగామ:మండలంలోని ఐతవరం వసంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ ఫార్ములా అయినటువంటి ఓ 3 రూపంలో విద్యార్థులను కూర్చోబెట్టి ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా ఉపాధ్యాయులు వివరించారు.

### వివాహితకు యువకుడి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత వెంటపడి వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఉప్పలపాటి రామచంద్రరావు వీధికి చెందిన బత్తుల మాధవి, ప్రసాద్ భార్యాభర్తలు. మాధవి జ్యూయలరీ షాపులో పని చేస్తుండగా, ప్రసాద్ వంట పని చేస్తుంటాడు. మాధవికి ఏడాదిగా వీరబాబు అనే యువకుడు పరిచయం అయ్యాడు. వీరబాబు మాధవిని అక్కా అని పిలిచేవాడు. వీరబాబు తనకు పరిచయం ఉన్న శాంతి అనే మహిళను ప్రేమించారు. కొద్ది రోజుల కిందట వీరబాబుకు శాంతికి గొడవ జరగడంతో దూరంగా ఉంటున్నారు. అప్పటి నుంచి వీరబాబు మాధవి వెంట పడి వేధింపులకు గురి చేయసాగాడు. తనతో మాట్లాడకపోతే చనిపోతానని, బ్లేడ్‌తో కోసుకుంటానని బెదిరింపులకు పాల్పడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### కారు పల్టీ కొట్టి వ్యక్తి మృతి

నందిగామ: మండలంలోని ఐతవరం సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం... కొమరం భీం జిల్లా నుంచి ఓ కారులో ఐదుగురు వ్యక్తులు దుర్గమ్మ దర్శనానికి విజయవాడకు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున నందిగామ మండలం ఐతవరం సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న సమయంలో కారు బ్రేక్ ఫెయిల్ అయింది. ఈ క్రమంలో కారు డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన పి.సాయి కిరణ్ (26)ను 108 వాహనంలో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మిగిలిన నలుగురుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నందిగామ: కడుపు నొప్పి తాళలేక ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కమ్మవారిపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరామినేని గోపి (26) గత కొంతకాలంగా తరచూ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గోపాలరావు తెలిపారు.

# వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు



స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్

నందిగామ: వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. ఒకటవ వార్డు పరిధిలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను వైస్ చైర్మన్ పాకాల పాటి కిరణ్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జయరాం మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. అందరి సహకారంతోనే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, ఆదర్శనీయంగా తీర్చిదిద్దవచ్చన్నారు. దోమల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# చవితి వేడుకలకు సిద్ధంగా గణపయ్యలు



గ్రామాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్న గణనాథులు





వర్షాలకు తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పి భద్రపరిచిన విగ్రహాలు

**అందంగా ముస్తాబైన విగ్రహాలు**

వత్సవాయి:ఈ నెల 18న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించకుని గ్రామాల్లో పలు కూడళ్లలో కొలువుదీరేందుకు రకరకాల ఆకృతులతో గణనాధులు అందంగా సిద్ధమయ్యారు. వినాయక నవరాత్రి వేడుకలకు గ్రామాల్లో పందిళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే గణపతి విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్నారు. పేట నియోజకవర్గంలో గణపతి విగ్రహాల తయారీకి చిల్లకల్లు, జగ్గయ్యపేట ప్రసిద్ధి. చిల్లకల్లులో మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా జగ్గయ్యపేటలో కోదాడ రోడ్‌లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని రాజస్థాన్‌కు చెందిన కొందరు కళాకారులు గత కొన్ని నెలలుగా వీటిని తయారు చేస్తున్నారు. వీరు తమ కళా నైపుణ్యంతో వినాయక విగ్రహాలను చూడచక్కగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ అవతారమూర్తుల రూపాల్లో, రకరకాల భంగిమల్లో తయారు చేసిన గణపతి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చవితి నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు భక్తులతో కొలువబడి పూజలందుకునేందుకు వందల సంఖ్యలో విగ్రహాలు తయారీగా ఉన్నాయి. కళాకారులు ఆరు నెలలు కష్టపడి తయారుచేసే విగ్రహాలకు ఒక్క భాద్రపద మాసంలో మాత్రమే డిమాండ్ ఉంటుంది. పండుగ రోజు దగ్గర పడుతున్న కొద్దీ విగ్రహాల ధర పెరుగుతుంటుంది. విగ్రహాల తయారీకి అవసరమయ్యే ముడిసరుకు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కొబ్బరిపీచు, రంగులు, సున్నం తదితర సామగ్రి ధరలు పెరగడం వల్ల ఈ ఏడాది విగ్రహాల రేట్లు సైతం అమాంతంగా పెంచేశారు. ఒక్కో విగ్రహానికి సైజును బట్టి రూ. 2000 నుంచి రూ. 70 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. వర్షాలకు తడవకుండా విగ్రహాలను రక్షించుకోవడం తయారీదారులకు పెను సవాలుగా మారుతుంటుంది. గణపతి విగ్రహాలకు అందంగా నగిషీలు దిద్దిన తరువాత వర్షానికి తడిస్తే అంతే సంగతులు. నెలలు తరబడి చే సిన శ్రమ మొత్తం వృథా అవుతుంది. ఇందుకు ప్రత్యేకంగా టార్పాలిన్ షెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. వర్షాల నుంచి విగ్రహాలను కాపాడుకోవటానికి ఒకొక్క విగ్రహానికి ఒకొక్క ప్లాస్టిక్ కాగితాలను కప్పుతున్నారు.

**చెరువుల్లో నీరు ఫుల్ .....**

నవరాత్రులను పురస్కరించుకుని గ్రామాల్లో పూజలు నిర్వహించిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. వర్షాలు బాగా పడటంతో చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. అవకాశం ఉన్నవారు కృష్ణానది, మునేటిలో నిమజ్జనాలు చేయగా కొందరు ఊరేగింపు తరువాత స్థానికంగా ఉన్న చెరువుల్లో నిమజ్జనాలు చేస్తుంటారు.

# ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

**అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు**



జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని ఇంటి వద్దనే అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. నందిగామ పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన ర్యాలీని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షలా ఉండేదన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టి నిరుపేదలకు సైతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించారని చెప్పారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి ప్రజలకు వైద్యాన్ని దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇళ్ల వద్దనే మెరుగైన వైద్య మందించేలా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను రూపొందించారని గుర్తు చేశారు. అంతటితో ఆగకుండా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో మరింత పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ జయరాం, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, బండారు వెంకట్రావ్, షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, కరి రవీంద్రబాబు, పలువురు నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

# ఇంటింటికీ ఆరోగ్య రక్ష



అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ప్రజలను ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. 31 వ వార్డులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆర్యోగ సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించే గొప్ప కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ చేపట్టారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి మ్యాపింగ్ చేస్తారని, ఏ ఇంట్లో ఎవరు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారో గుర్తించి వారికి ఉచితంగా వైద్యం చేసి మందులు అందిస్తారని తెలిపారు. తొర్రగుంటపాలెంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉదయభాను ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవి శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, నాయకులు ఫిరోజ్‌ఖాన్,పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మండల యూత్ అధ్యక్షుడు బజారు సాయి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.